క్లుప్తంగా

13న వైఎస్సార్ సీపీ సభ

జంగారెడ్డిగూడెం: ఈనెల 13న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక దండమూడి కళ్యాణ మండపం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జెట్టి గురునాధరావు తెలిపారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల నుంచి పెద్దెత్తున కాంగ్రెస్, వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీకి చేరికలు ఉంటాయని ఆయన చెప్పారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి కార్లు, మోటార్‌సైకిళ్ల ర్యాలీగా కొత్తబస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, గంగానమ్మ గుడి సెంటర్, పాత బస్టాండ్, ఫైర్‌స్టేషన్ మీదుగా సభా వేదిక వద్దకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన నేతలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులను పలకరించి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, ఏరియా ఆసుపత్రి పరిధిలో అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంపూర్ణ వైద్యం అందేలా కృషిచేయాలని సూచించినట్లు వైఎస్సార్ సీపీ ఏజెన్సీ, మెట్ట సీనియర్ నాయకుడు జెట్టి గురునాధరావు తెలిపారు. జెట్టి గురునాధరావు వెంట ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీ రీజనల్ కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి, స్థానిక కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, కంచర్ల గీత, సీనియర్ నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, ఓరుగంటి నాగేంద్ర, పెనరగంటి త్రిమూర్తులు, నేట్రు గణేష్ పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు గిరిజన రైతుల అభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం: గిరిజన ఉప ప్రణాళిక నిధులతో గిరిజన సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని సీటీఆర్ఐ ఆర్ఎస్ హెడ్ డాక్టర్ వైవీ సుబ్బయ్య అన్నారు. జీలుగుమిల్లి ఐసీఏఆర్ కేంద్రీయ పొగాకు పరిశోధనా స్థానంలో సోమవారం రైతులకు వ్యవసాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 50 మంది గిరిజన రైతులకు స్ప్రేయర్లు, 50 మందికి చేతి పనిముట్లు ఉచితంగా అందజేశారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త ఎం.వెంకటేష్, ఫార్మ్ మేనేజర్ టి.వెంకటేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

జంగారెడ్డిగూడెం: గుర్తు తెలియని వ్యక్తి దాడిలో ఒక వృద్ధురాలు గాయపడింది. ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సీఎస్ఆర్ మాల్ వెనుక ఒక పాఠశాల సమీపంలో మండ దుర్గ నివాసం ఉంటోంది. ఆమె భర్త చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీయగా, ముఖానికి ముసుగు వేసుకున్న వ్యక్తి కత్తితో దుర్గ మెడపై పెట్టి బెదిరించాడు. ఆమె ప్రతిఘటిస్తూ కత్తిని చేతితో పట్టుకొని బిగ్గరగా కేకలు వేయడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. స్థానికులు వెంటనే దుర్గ కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గను డీఎస్పీ యు.రవిచంద్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్సై జ్యోతిబాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. లక్కవరం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం తడి, పొడి చెత్త సేకరణ బుట్టలను ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, సొసైటీ చైర్మన్ దల్లి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే పట్టెన్నపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, సచివాలయ కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు చేతుల మీదుగా తడి, పొడి చెత్త బుట్టలను అందజేశారు.

పోలీసుల కవాతు

చింతలపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రగడవరం, యర్రగుంటపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై కుటుంబరావు, సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

పరామర్శ

పోలవరం రూరల్: పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన పెంటపాటి హర్షకుమార్ కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పరామర్శించారు. టీబీఆర్ ఫౌండేషన్ తరుపున రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని రాయితీలను అధికారులతో మాట్లాడి త్వరగా వచ్చేలా ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. రాజ్యలక్ష్మి వెంట ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు

మహిళల అభ్యున్నతి కోసమే చేయూత

వైఎస్సార్ చేయూత
నాలుగో విడత చెక్కుల పంపిణీ

కొయ్యలగూడెం: మహిళల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం అమలు చేశారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. చేయూత వారోత్సవాలలో భాగంగా నాలుగో విడతలో లబ్ధిదారులైన మహిళలకు సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి బాలరాజు చెక్కును పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అశోక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలో 3,938 మంది లబ్ధిదారులకు రూ.7.38 కోట్లు చేయూత పథకం ద్వారా అందజేసినట్లు పేర్కొన్నారు. డ్వాక్రా రుణాలు, చేయూత సొమ్ము పంపిణీతో అక్కచెల్లెమ్మలు చిరు వ్యాపారాల స్థాయి నుంచి చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారని రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు సార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి జగనన్న రుణం తీర్చుకుంటాం అని మహిళలు ఈ సందర్భంగా తెలిపారు. ఏపీఎం కె.నాగ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్టా వనజలక్ష్మి, ఫుడ్ కమిషన్ నెంబర్ గంజిమాల దేవి, గొడ్డటి రాణి, చిక్కాల మంగతాయారు, తోట కృపామణి, నిడదవోలు రాజ్యలక్ష్మి, ఘంటసాల సీనమ్మ, తాడిగడప రామకృష్ణ, మంతెన సోమరాజు, గంట శ్రీను, నూకల రాము, తేలే శ్రీను, చిక్కాల దుర్గాప్రసాద్, మారిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి



చింతలపూడి: వైఎస్సార్ చేయూత చెక్కును మహిళలకు అందజేస్తున్న విజయరాజు

నిజాయతీకి నిదర్శనం వైఎస్సార్ సీపీ

చింతలపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత చెక్కును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిజాయతీకి, నిబద్ధతకు నిదర్శనం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. మహిళల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. అది వేస్టు ఖర్చు అన్న టీడీపీ నాయకులకు మహిళలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మండలంలో 5,358 మంది మహిళలకు రూ.10,04,62,500 చేయూత చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్న రాట్నాలు, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజ సుధాకర్, వైఎస్సార్ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం చంటి, వైఎస్సార్ యూత్ రాష్ట్ర కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, ఈస్ట్ యడవల్లి సర్పంచ్ పొన్నాల అనిత, వెంకటాద్రిగూడెం సర్పంచ్ ఆర్‌వీ రామారావు, వెంకటాపురం సర్పంచ్ చేపూరి సాయికుమారి, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎం.దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి జి రాజేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ సీహెచ్ ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

లింగపాలెం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అన్ని వారి పేరుపై అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండల పరిషత్ ఆవరణలో సోమవారం వైఎస్సార్ చేయూత నాల్గవ విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ: 18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ:75 వేల చొప్పున అందజేశారని వారంతా సీఎం జగన్‌కి అండగా నిలవాలని కోరారు. అనంతరం చేయూత లబ్ధిదారులకు చేయూత చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునునూరు వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ వడ్లాని హరినాధరాజు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారు మోహన్, పార్టీ నేతలు పొన్నాల అనితమ్మ, మునునూరు వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు బాలరాజు పర్యటన

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త రాజ్యలక్ష్మి మంగళవారం కుక్కునూరు మండలంలో పర్యటిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నర్సింహారాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలు ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వైయస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సును సోమవారం ఆవిష్కరించారు. ఫంక్షనల్ ఇంగ్లీష్ గ్రామర్ అనే అంశంపై 45 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. ప్రసాద్‌బాబు చెప్పారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి అబ్బిన దత్తాత్రేయ, సత్యవతి దంపతులు రూ.50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను వేద ఆశీర్వచనాలు, అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించారు.

భక్తుడికి పాముకాటు

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన ఒక భక్తుడు స్వామి వారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో పాము కాటుకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే గణపవరం మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన పరింకల ఏసు శ్రీవారి దర్శనార్థం సోమవారం ఆలయానికి విచ్చేశారు. దర్శనం అనంతరం స్వగ్రామానికి వెళ్లే క్రమంలో నడుచుకుంటూ గరుడాళ్వార్ సెంటర్‌కి వెళ్లుతున్నాడు. ఘటనా స్థలం అయిన కొండ మీద టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి ఒక పాము అతడిని కాటు వేసింది. దీంతో అక్కడ ఉన్న వారు వెంటనే ఏసును స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సారా బట్టీలపై దాడులు

పోలవరం రూరల్: పోలవరం మండలం అత్యంత మారుమూల అటవీ ప్రాంతంలో నాటు సారా తయారుచేసే బట్టీలపై ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే 50 లీటర్లసారాను కూడా ధ్వంసం చేశామని, నిందితుల కోసం గాలిస్తున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

శివయ్యకు శ్రీపుష్ప యాగోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్ప యాగోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

జనసేన, టీడీపీ మధ్య మాటల యుద్ధం

కుక్కునూరు: జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా పోలవరం అసెంబ్లీ సీటును జనసేన అభ్యర్థికి కేటాయించడం పట్ల మండలంలో ఆ రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్‌కు టికెట్ కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిరసన తెలియజేశారు. దీంతో స్పందించిన జనసేన మండల ఉపాధ్యక్షుడు మంత్రి గోపాలకృష్ణ సోమవారం విలేకరులకు ఓ ప్రకటన విడుదల చేశారు. జనసేన మిత్రపక్ష పార్టీ నాయకులు పొత్తు ధర్మం పాటించాల్సిందేనన్నారు. మా నాయకుడు మాటే మాకు శిరోధార్యం, మీ నాయకుడి నిర్ణయం మీరు పాటించరా అని ప్రశ్నించారు. పొత్తులో భాగంగా మాకు 24 సీట్లు మాత్రమే ఇస్తే మేము సర్దుకుపోట్లేదా అని.. మీరు మాకు సహకరించకపోతే మిగిలి ఉన్న 145 నియోజకవర్గాల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఉమ్మడి అభ్యర్థి గెలుపు లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజల కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి జగన్

పోలవరం రూరల్: ప్రజల కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పోలవరం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం పోలవరం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం పునర్నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. అలాగే ఇటుకులకోట గ్రామ పంచాయతీ పరిధిలో రూ.17.59 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె పాల్గొన్నారు. 1220 మంది మహిళలకు వైఎస్సార్ చేయూత రూ.4,17,93,000 చెక్కును అందజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన 1192 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1.95 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. జగనన్న ఆశీస్సులతో, ఎమ్మెల్యే బాలరాజు దీవెనలతో పోలవరం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీ బుచ్చిబాబు, వెలుగు ఏపీఎం బి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబు పాల్గొన్నారు.



హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి

సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయి

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు దోహదపడుతున్నాయని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొవ్వాడలో సోమవారం సాయంత్రం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురిని కలిసి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, నాయకులు ములగాల నాగేశ్వరరావు, కుంజా ప్రసాద్, రమణా నాగు, మడకం రవి, కుంజా శిరమయ్య, కపిలవాయి హరిసూర్యనారాయణ, తేనె రాజ్‌కుమార్, బొజ్జి దొర, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి గ్రామంలో నిర్వహించాలి

వైఎస్సార్ సీపీ 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా మంగళవారం పోలవరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. అదేవిధంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ద్వారకాతిరుమల: జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ఐఎస్ రాఘవాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. అలాగే జి.కొత్తపల్లి నుంచి నల్లజర్ల మండలం పోతవరానికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. అందుకే ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రతిపక్ష నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమంతో పాటు, అభివృద్ధిని సైతం చేసి చూపిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ దాకారపు బంగారమ్మ, దాకారపు అగ్గియ్య, పసుపులేటి ఏసుబాబు, మటపర్తి పుల్లయ్య, పసుపులేటి సాయిబాబు, బోడపాటి చంద్రం, రేగంటి వెంకటేశ్వరరావు, కస్సే శ్రీహరిరావు, రెడ్డి ప్రసాద్, తోటకూర నాగయ్య, మానికల వెంకటేశ్వరరావు, బాలాజీ, రాజేష్ తదితరులున్నారు.



జి.కొత్తపల్లిలో రహదారి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వనిత

వలంటీర్ల సేవలు అభినందనీయం

లింగపాలెం: ప్రజలకు, ప్రభుతా మధ్య వారధులుగా వలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. ధర్మాజీగూడెంలో సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన వలంటీర్ల ఆత్మీయ పరిచయ వేదికకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు వలంటీర్లు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ వలంటీర్లకు ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, మోరంపూడి జగన్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూతుల పాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభలతో ప్రతిపక్ష పార్టీల్లో దడ

చింతలపూడి: వైఎస్సార్ సీపీ నిర్వహించిన సిద్ధం సభలతో ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీల గుండెల్లో దడ మొదలైందని నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని మల్లాయగూడెం, పోతునూరు గ్రామాల్లో సోమవారం కార్యకర్తలు, నాయకులతో పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా కష్టపడి పని చేస్తే వైఎస్సార్ సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, పోతునూరు సర్పంచ్ కందుల లక్ష్మీ ప్రసన్న కుమారి, సొసైటీ చైర్మన్ కందుల గోవర్ధన రెడ్డి, తుమ్మూరు ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎమ్ఎస్ఆర్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, వెంకట్‌రెడ్డి, హనుమంతరావు, సంజీవరెడ్డి, మల్లాయగూడెం నాయకులు చీకటి బాపూజీ, పి ఏసు, చెన్నారావు, చీకటి చంద్రశేఖర్, జి రాజేష్‌నాయుడు, ఆర్‌వీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్మాజీగూడెంలో వలంటీర్లకు భోజనం వడ్డిస్తున్న విజయరాజు

జన ప్రభంజనం జగన్ వెంటే

కొయ్యలగూడెం: జన ప్రభంజనం జగన్ వెంటే ఉంది.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను ప్రభంజనానికి తిరుగు ఉండదు.. ముఖ్యమంత్రి జగన్ అన్నకు ఎదురు ఉండదు అని వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పొంగుటూరు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. పొత్తుల జిత్తులతో టీడీపీ, జనసేన, బీజేపీ సీట్లు కోసం తన్నుకుంటున్నారని, ప్రజలు దీనిని చూసి నవ్వుకుంటున్నారని రాజ్యలక్ష్మి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రూ.1.70 కోట్లతో నిర్మించిన నూతన హైస్కూల్ తరగతి గదుల భవనాలను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. ముందుగా సర్పంచ్ పసుపులేటి రాంబాబు ఆధ్వర్యంలో బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను గజమాలతో సత్కరించారు. పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ నేలపోలు దుర్గారావు, నాయకులు గేలం శ్రీను, కొల్లూరి సత్తిబాబు, తోట శ్రీను, గేలం వెంకటేశ్వరరావు, కై కవరపు గోపి, తానేటి రాజు, పసుపులేటి రవీంద్ర, సొంఠి నాగేశ్వరరావు, పామర్తి సుబ్బలక్ష్మి, యడ్లపల్లి సురేష్, సొంగ రాకేష్, మందపాటి రామకృష్ణ, ఏలేటి చంద్రం, దూలపల్లి కాంతారావు, నేలపోలు సూరిబాబు, కుర్సం మురళి, తదితరులు పాల్గొన్నారు.



పొంగుటూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బాలరాజు దంపతులు

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జంగారెడ్డిగూడెం: వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలోని అన్ని సమస్యలు తీర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వీధి లైట్లు, రోడ్డు, డ్రెయిన్‌లు తదితర మౌలిక సమస్యలు తీర్చేందుకు కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా రానున్న వేసవి కాలంలో మంచినీటి సమస్య రాకుండా ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులకు, వాటర్ వర్క్స్ సిబ్బందికి తగు సూచనలు చేశామన్నారు. మంచినీటి అవసరాలు ముందుగానే గుర్తించి తదనుగుణంగా మంచినీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పట్టణంలో ఇప్పటికే కౌన్సిల్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి జంగారెడ్డిగూడెంను సుందరీకరిస్తామని పేర్కొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చేసిన తీర్మానాలు

- 25వ వార్డులో ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు.
- సాలిపేట రోడ్డులో రోడ్డు నిర్మాణానికి గతంలో పిలిచిన టెండర్ రద్దు కాగా, కొత్తగా పిలిచిన టెండర్‌కు ఆమోదం.
- 9వ వార్డులో 2 సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయింపు
- 8వ వార్డు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 లక్షలు కేటాయింపు
- 20వ వార్డులో పైప్‌లైన్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తూ తీర్మానం
- 14వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు కేటాయిస్తూ తీర్మానం

సమావేశంలో వైస్‌చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిల్ సభ్యులు, మేనేజర్ కేవీ రమణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతి

బుట్టాయగూడెం: బ్రిటిష్ కాలం నుంచి గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న తమకు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇచ్చేలా కృషి చేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, సర్పంచ్ కారం లక్ష్మి ఆధ్వర్యంలో మోదేలు గ్రామ గిరిజనులు సోమవారం ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవ, లక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి నివాస యోజన పథకంలో 20 కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే 18 కుటుంబాలకు రూ.70 వేల చొప్పున అకౌంట్‌లో డిపాజిట్ కూడా అయ్యాయని, కానీ ఇళ్లు నిర్మించే సమయంలో అటవీశాఖ అధికారులు ఇళ్ల నిర్మాణం చేపడితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని చెప్పారు. దీనిపై పీఓ సూర్యతేజ మాట్లాడుతూ గ్రామ, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఐటీడీఏ పీఓ సూర్యతేజకు వినతిపత్రం అందజేస్తున్న మోదేలు గ్రామస్తులు

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ సందర్శించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్ భక్త హనుమాన్‌ను అడిగి తెలుసుకున్నారు. 348 విద్యార్థులకు గానూ 331 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల పంపిణీ

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పిస్తూ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేయడం అభినందనీయం అని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జెట్టి గురునాధరావు, పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కన్వీనర్ బీవీఆర్ చౌదరి అన్నారు. పట్టణంలో సోమవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కాకుండా వారి ఇళ్లకు శాశ్వత హక్కు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఆయన బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్లు పీపీఎన్ చంద్రరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, దిర్శిపోము ధనలక్ష్మి, నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, షేక్ అమీర్, షేక్ అక్బర్, గెద్దాడ శ్రీనివాస్, కబీర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను అందజేస్తున్న దృశ్యం